సాక్షి చిత్తూరు
శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



వీఐపీలకు బ్లాక్‌మెయిల్ కాల్స్
ఆర్థికస్తోమత కలిగిన వారిని ఎంచుకుని, వాట్సాప్ కాల్స్ ద్వారా బ్లాక్ మెయిల్ చేస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. - 8లో



రూ.70 లక్షల మొబైల్ ఫోన్ల రికవరీ
జిల్లాలో పోగొట్టుకున్న, చోరీ అయిన 330 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి వాటిని యజమానులకు అందజేశారు. - 8లో



ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కేసులు
ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కేసులు నమోదు చేస్తామని చౌడేపల్లె తహసీల్దార్ ఆక్రమణదారులను హెచ్చరించారు. - 8లో

న్యూస్‌రీల్

15లోపు కంటి రోగుల సర్వే పూర్తి



వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం: నియోజకవర్గ పరిధిలో ఇంటింటి సర్వేను ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేసి కంటి రోగుల జాబితాను సిద్ధం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మండల కార్యాలయంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఇంటినీ సర్వే చేసి కంటి సమస్యలతో బాధ పడుతున్న రోగులను గుర్తించాలని ఆయన తెలిపారు. కంటి రోగులకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు బాల్య వివాహాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్‌ఎంలు గర్భిణుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కంటి వెలుగు స్పెషల్ ఆఫీసర్ డా.అర్షితా, మెడికల్ ఆఫీసర్లు మునిరత్నం, డా.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హులందరూ పీఎం విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ కోరారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రారంభించిందన్నారు. కేవలం 5 శాతం వడ్డీకే రూ.3 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఈ పథకంలో ఉందన్నారు. సంప్రదాయ, చేతివృత్తులు చేసేవారి కోసం ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించిందని తెలిపారు. 2027-28 వరకు ఈ పథకం అమలులో ఉంటుందన్నారు. కళాకారులు, చేనేత కార్మికులకు పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్‌తోపాటు గుర్తింపుకార్డును అందిస్తారని చెప్పారు. 5 శాతం వడ్డీతో తొలి విడత రూ.1 లక్ష, రెండవ విడత రూ.2 లక్షలు రుణం అందిస్తారన్నారు. 18 సంప్రదాయవృత్తులైన వడ్రంగి, స్వర్ణకారులు, కుమ్మరి, కమ్మరి, శిల్పులు, రాతి పని, చెప్పులు తయారు చేసేవారు, మేసస్, తాపీ పని, బుట్టలు, చాపలు, చీపుర్లు, తాళ్లు అల్లేవారు, సంప్రదాయకంగా బొమ్మలు తయారు చేసేవారు, క్షురకులు, పూలదండలు చేసేవారు, లాండ్రీ, టైలర్, చేపల వలలు, సుత్తి- పనిముట్లు, తాళాలు తయారు చేసేవారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. జిల్లాలో ఉన్న అర్హులు ఈ పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకుని రుణాలు పొందాలని కలెక్టర్ సూచించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 75,109 మంది స్వామివారిని దర్శించుకోగా 30,285 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.40 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తుంది. కేటాయించిన సమయంకన్నా ముందు వెళ్లిన భక్తులను క్యూలైన్‌లో అనుమతిస్తారని తెలుపుతున్నారు.

పర్యాటక కేంద్రంగా కుప్పం



మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం: పర్యాటక కేంద్రంగా కుప్పం తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. ఆయన గురువారం టూరిజం శాఖ అధికారులతో కడా కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ననియాలు ఏకో టూరిజం, కంగుంది కోట, మల్లప్ప కొండ, గుడివంక సుబ్రమణ్య స్వామి దేవాలయం, బేటరాయ స్వామి కొండ, కైగల్ జలపాతం, రామకుప్పం మండలం చెలిచేన్లు తదితరుల ప్రాంతాలు పర్యాటకానికి అనుకూలంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో పర్యాటక పరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలోని పర్యాటక స్థలాలను పరిశీలించి అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో టూరిజం రీజనల్ జాయింట్ డైరెక్టర్ రమణ ప్రసాద్, డీఈ శ్రీనివాసుల రెడ్డి, డీటీసీఈ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అడ్డదారిలో అడ్డగోలుగా..
బడిలో పచ్చ గద్దలు



కార్వేటినగరం: గంగమాంబపురం హైస్కూల్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా అధికార పార్టీ కుట్రలకు తెరలేపింది. సర్కారు విద్యకు గత ప్రభుత్వం ఊపిరి పోసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిందే తడవుగా పేదలకు ప్రభుత్వ విద్యను అందకుండా చేసేందుకు పన్నాగం పన్నింది. అందుకే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలను రాజకీయం చేసింది. పాఠశాలల్లో విద్యార్థుల అవస్థలు, వసతులపై ప్రశ్నించే ఎస్ఎంసీల్లో తమ వారిని నియమించుకుంటోంది. ఇకపై స్కూళ్లలో ఏం జరిగినా ప్రభుత్వాన్ని నిలదీయకుండా ఉండేందుకు పక్కా స్కెచ్ వేసింది. ఎస్ఎంసీ ఎన్నికల్లో నిబంధనలను పక్కన పెట్టి తమ వారి జాబితా విద్యా శాఖ అధికారులకు అందజేసింది. వారు ఆ పేర్లను చదివి వారే ఎన్నికైనట్లు ప్రకటించేలా ఒత్తిడి చేసింది. తద్వారా ప్రైవేటు స్కూళ్లకు మరింత లాభాలు చేకూర్చేందుకు ప్రణాళిక రచించింది. మొత్తంగా పేదలకు ప్రభుత్వ విద్యను అందని ద్రాక్షగా మార్చేందుకు ఇలా అడ్డగోలు రాజకీయాలు చేస్తోంది. అధికారులను గుప్పిట్లో పెట్టుకుని ఈ తతంగం నడిపించింది. కొన్ని చోట్ల తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో ఎన్నికలు వాయిదా వేయడం గమనార్హం.

- పేరుకే ఎన్నికలు.. అన్ని చోట్లా ప్రకటనలే
- జిల్లాలో రసాభాసగా ఎస్ఎంసీ ఎన్నికలు
- గంగాధరనెల్లూరులో దళితులపై టీడీపీ నేతల దౌర్జన్యం
- విద్యాశాఖ అధికారులపై అధికార పార్టీ ఎమ్మెల్యేల ఒత్తిడి
- పలు చోట్ల వాగ్వాదాలు, వాయిదాలు

చిత్తూరు జిల్లా ఎస్ఎంసీ ఎన్నికల సమాచారం

ఎన్నికలు నిర్వహించిన పాఠశాలలు	2458
ఎన్నికలు పూర్తయిన పాఠశాలలు	2451
వాయిదాపడిన పాఠశాలల సంఖ్య	07

ఎన్నికలు నిలిచిపోయిన పాఠశాలలు

- ఎంపీపీ-మంకలదొడ్డి (కుప్పం)
- జెడ్పీ - వసనాడు (కుప్పం)
- ఎంపీయూపీ (పాలసముద్రం)
- జెడ్పీ - కొత్తపల్లిమిట్ట (ఎస్ఆర్ పురం)
- ఎంపీపీ - కొప్పేడు (నింద్ర)
- జెడ్పీ - కొట్టాలం (యాదమరి)
- ఎంపీపీ - కీలపొరాడి (బైరెడ్డిపల్లి)

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఎస్ఎంసీ ఎన్నికలను గురువారం ఏకపక్షంగా నిర్వహించారు. టీడీపీ నేతలు అధికార బలాన్ని చూపించి ఇష్టానుసారంగా ఎన్నికలు నిర్వహించారు. ఇదేమిటని ప్రశ్నించిన తల్లిదండ్రులకు సమాధానం కరువైంది. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహించే కుప్పం నియోజకవర్గంలో ఎన్నికల తీరుపై ఇక చెప్పాల్సిన పనేలేదు. ఆ పార్టీకి అనుకూలమైన వారిని ముందస్తుగా ఎంపిక చేసుకున్నారు. వారి పేర్ల జాబితాను విద్యాశాఖ అధికారులకు ఇవ్వగా గురువారం వారినే ప్రకటించుకున్నారు. కుప్పం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇదే తీరులో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. శాంతిపురం మండలం ఏడవమైలు ప్రాథమిక పాఠశాలలో 32 మంది విద్యార్థులున్నారు. ఎన్నికలకు 17 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు. ఇందులో 11 మంది వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు మద్దతు ఇచ్చారు. దీంతో ఆ పాఠశాలలో ఎన్నికలను వాయిదా వేశారు.

సీల్డ్ కవర్‌లో జాబితా

ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు నియమ, నిబంధనలు రూపొందించారు. నిబంధనల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వుల్లో సైతం పేర్కొన్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఎన్నికలు ఆ విధంగా నిర్వహించలేదు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో నిబంధనలకు పాతరేసి, ఎన్నికలు నిర్వహించారు. ముందస్తుగానే కూటమి ఎమ్మెల్యేలు తమకు అనుకూలమైన అభ్యర్థుల పేర్లను సీల్డ్ కవర్లలో విద్యాశాఖ అధికారులకు అందించినట్లు సమాచారం. స్వయాన సీఎం నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల తతంగమే ప్రత్యక్ష ఉదాహరణ. ఆ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని పాఠశాలల్లోనూ సీల్డ్ కవర్ తతంగమే కొనసాగిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సీల్డ్ కవర్‌లో పేర్కొన్న విధంగా ఎస్ఎంసీ ఎన్నికల చైర్మన్, వైస్ చైర్మన్‌ల పేర్లను ఏకపక్షంగా ప్రకటించి రిజిస్టర్లలో సంతకాలు చేయించుకుని ప్రతిజ్ఞ చేయించి పంపేశారు. ఇంతమాత్రాన ఎస్ఎంసీ ఎన్నికలు ఎందుకు నిర్వహించాలని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాట వినకపోతే సస్పెండ్ చేస్తాం

చిత్తూరు ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ తీరు ఇటు విద్యాశాఖ అధికారులకు, అటు పాఠశాలల హెడ్ మాస్టర్లకు తలకు మించిన భారంగా మారింది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించలేకపోయామంటూ పలువురు హెచ్ఎంలు వారి సహచరులతో వాపోయారు. ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించకపోతే సస్పెండ్ చేయిస్తామనే బెదిరిస్తున్నారని హెడ్‌మాస్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి హెచ్ఎంలు తీసుకెళ్లినా వారు చేతులెత్తేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా కళ్ల ముందు జరుగుతున్న ఎన్నికలను చూస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు చేసేదేమీ లేక మిన్నకుండిపోయారు. విద్యాశాఖ అధికారులు టీడీపీ నేతలకు సరెండర్ అయిపోయారు.

రోజంతా ఉత్కంఠ

చిత్తూరు జిల్లాలో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించడంతో రోజంతా ఉత్కంఠ నెలకొంది. ఉదయం 7 గంటల నుంచే బడుల వద్ద సందడి వాతావరణం కనిపించింది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు చాలా మంది తల్లిదండ్రులు ఎంతో ఆశతో వచ్చారు. అయితే పలు చోట్ల ఎమ్మెల్యేల జోక్యంతో ముందుగానే జాబితా సిద్ధం కావడంతో ఆశావహులకు పోటీకి అవకాశం ఇవ్వలేదు. చిత్తూరు జిల్లాలో ప్రాథమిక 1,817, ప్రాథమికోన్నత 185, ఉన్నత పాఠశాలలు 456 మొత్తం 2,458 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. ఏకపక్షంగా చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నట్లు హెచ్ఎంలు ప్రకటించేసి చేతులు దులుపుకున్నారు.

జిల్లా అంతటా అడ్డగోలుగానే..

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ ఎస్ఎంసీ ఎన్నికలు అడ్డదిడ్డంగానే నిర్వహించారు. సదుం మండలం పాలమంద జెడ్పీ హైస్కూల్‌లో చైర్మన్‌గా నిలబడిన రెడ్డెప్ప, సాబ్జాన్‌లు ఇద్దరికీ 10 ఓట్లు చొప్పున వచ్చాయి. దీంతో మళ్లీ ఎన్నికలు నిర్వహించారు. రెండవ సారి నిర్వహించిన ఎన్నికల్లో రెడ్డెప్పకు 14 ఓట్లు రావడంతో గెలుపొందినట్లు ప్రకటించి, ప్రమాణస్వీకారం చేయించారు. అయితే ఓర్వలేని టీడీపీ నేతలు ఉన్నతాధికారులపై ఒత్తిడి చేయడంతో పెండింగ్‌లో పెట్టారు. పలమనేరు మండలం ముడివారిపల్లి, జల్లిపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ముందస్తు సమాచారం లేకుండా ఎన్నికలు నిర్వహించారని తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికలు రద్దు చేయాలని తల్లిదండ్రులు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ నేతలు అంగీకరించకపోవడంతో ఎన్నికలు రద్దు చేయలేదు. పాలసముద్రం మండలం సింహరాజుపురంలో టీడీపీ నాయకులు విద్యాశాఖ అధికారులపై దౌర్జన్యం చేసి కమిటీని ప్రకటించుకున్నారు.



పాలసముద్రం: సింహరాజుపురంలో అధికారులపై దౌర్జన్యం చేస్తున్న టీడీపీ నాయకులు

దళితులకు నో చాన్స్

అధికారంలోకి రాకముందు దళితులపై చంద్రబాబు మమకారం, అధికారంలోకి వచ్చాక అహంకారంగా మారుతుందనే విషయం అందరికీ తెలిసిందే. గంగాధరనెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండలంలో నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికల్లో దళితులు పోటీ చేయడానికి ముందుకు వచ్చారు. గంగమాంబపురం జెడ్పీ హైస్కూల్లో దళిత వర్గాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఎన్నికల్లో పోటీ చేయనిచ్చేది లేదని చెప్పారు. "ఈ సారి కుదరదు ఇంకోసారి చూద్దాం. ఇక్కడి నుంచి వెళ్లిపోండి." అని చెప్పారు. దీంతో ఆ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా చేశారు. అయినా అధికారులు మాత్రం టీడీపీ నేతలు చెప్పిన వారే ఎన్నికైనట్లు ప్రకటించారు.

దళితులకు అర్హత లేదా?



నా కొడుకు జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. టీడీపీకి ఇప్పటికీ దళితులంటే చిన్న చూపే. ఎస్ఎంసీ చైర్మన్ పదవికి పోటీ చేసే అర్హత మాకు లేదని ఎలా చెబుతారు. మా పిల్లలను బడిలో చదివిస్తున్నాం. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి జరగలేదు. ఇప్పుడే అధికారం ఉందని ఇష్టానుసారంగా చేస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలి. – నల్లంజి, విద్యార్థి తల్లి, కార్వేటినగరం మండలం.

అధికారులు వారికే సపోర్టు



నా కొడుకు గంగమాంబపురం బడిలో 8వ తరగతి చదుకుంటున్నాడు. అధికారులు మాలాంటి దళితులకు అన్యాయం చేయడం కరెక్టు కాదు. ఎస్ఎంసీ ఎన్నికల్లో మేము నిలబడకూడదని ఏమైనా ఉత్తర్వులు ఇచ్చారా? అధికారులు టీడీపీ నేతలకే సపోర్టు చేస్తున్నారు. అందుకే ధర్నా చేశాం. అయినా పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు మాకు న్యాయం చేయాలి. – పుష్ప, విద్యార్థి తల్లి, కార్వేటినగరం మండలం

ఉద్యోగం లద్దిగంలో.. సేవలు పలమనేరులో!

- డీఎంహెచ్‌వోకు పట్టుబడిన మెడికల్ ఆఫీసర్



సొంత క్లినిక్‌లో సేవలందిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌ను ప్రశ్నిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి

పలమనేరు: ఆయన ఓ ప్రభుత్వ వైద్యుడు, నిత్యం గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రభుత్వం ద్వారా జీతం తీసుకుంటూ పీహెచ్‌సీలో ఉండకుండా పలమనేరులోని ప్రైవేటు ఆస్పత్రిలో సేవలందిస్తూ డీఎంహెచ్‌వోకు అడ్డంగా దొరికిపోయాడు. ఈ సంఘటన గురువారం పలమనేరు పట్టణంలోని ఆరోగ్య ఫార్మసీ పక్కనున్న ప్రైవేటు ఆస్పత్రిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే చౌడేపల్లి మండలం లద్దిగం పీహెచ్‌సీలో ప్రవీణ్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన గత కొన్ని నెలలుగా పలమనేరులో సొంత ప్రాక్టీస్ మొదలు పెట్టారు. ఇక్కడ ఓపీ ఎక్కువగా ఉండడంతో ఇక్కడే ఎక్కువగా ఉండేవారు. దీనిపై డీఎంహెచ్‌వో ప్రభావతి దేవీకి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆమె గురువారం ఉదయం పలమనేరులో సొంత క్లినిక్‌లో సేవలందిస్తున్న ప్రవీణ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయనపై చర్యలకు ఆమె ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. ఆపై లద్దిగం ఆస్పత్రిని సందర్శించి అక్కడ డాక్టర్ లేని విషయాన్ని నిర్ధారించుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా జీతాలు తీసుకొని గ్రామీణ పేదలకు సేవలందించకుండా సొంత క్లినిక్‌లు పెట్టుకుని ప్రాక్టీస్ చేసే ప్రభుత్వ వైద్యులపై చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. కొందరు మెడికల్ షాపు యజమానులు స్టోర్ పక్కనే ఆస్పత్రులను ఏర్పాటు చేసుకుని వారి స్వార్థంకోసం ప్రభుత్వ వైద్యులకు భారీగా కమీషన్లు ఇస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై సైతం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బాధిత కుటుంబాలకు రోజా పరామర్శ



ఫజుల్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : మండల, మున్సిపల్ పరిధిలో ఆప్తులను కోల్పోయి బాధపడుతున్న కుటుంబాలను మాజీ మంత్రి ఆర్కేరోజా పరామర్శించారు. రూరల్ మండల మాజీ సచివాలయ కన్వీనర్ హరికి ఇటీవల బిడ్డ పుట్టి మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. సమాచారమందుకున్న రోజా గురువారం వేలావడి గ్రామానికి వెళ్లి హరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నగరి పట్టణానికి చెందిన హనిఫా హోటల్ యజమాని ఫజుల్ సతీమణి ఇటీవల మృతి చెందారు. ఆ సమయంలో అందుబాటులో లేకపోవడంతో రాలేకపోయిన మాజీ మంత్రి గురువారం ఫజుల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి పిల్లలను ఓదార్చారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నింద్ర మండలంలో..

నింద్ర: మండలంలోని జీఎస్ కండ్రిగకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మధు తల్లి కోనమ్మ రెండు రోజుల క్రితం మృతి చెందారు. వారి కుటుంబాన్ని మాజీ మంత్రి పరామర్శించారు. వైస్ కండ్రిగకు చెందిన కార్యకర్త పవన్‌కుమార్ వారం క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఆయన్ను రోజా పరామర్శించారు. బాధితుల కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, మండల పార్టీ కన్వీనర్ వేణురాజు, వైస్ ఎంపీపీ శుభా, ఎంపీటీసీ సభ్యులు విజేష్, కో-ఆప్షన్ సభ్యులు అనిల్, సర్పంచ్‌లు సూర్య, బాబురెడ్డి, రాజేష్, తిరుమలరెడ్డి, నాయకులు శివయ్య, సత్యరాజ్, వీరయ్య పాల్గొన్నారు.

జిల్లాలో 150 డెంగీ కేసులు



చౌడేపల్లె: వైద్యాధికారులకు సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ ప్రభావతి

చౌడేపల్లె: సీజనల్ వ్యాధులతో పాటు జిల్లా వ్యాప్తంగా 150 డెంగీ కేసులు17 చికెన్ గున్యా కేసులు నమోదయ్యాయని డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి తెలిపారు. చౌడేపల్లె, లద్దిగం పీహెచ్‌సీలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చౌడేపల్లె పీహెచ్‌సీలో రోగులకు సక్రమంగా వైద్య సేవలందించడంలేదని ఆరోపణలున్నాయని విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వైద్యులు ఆదివారం సైతం ఓపీ నిర్వహించి మధ్యాహ్నం వరకు అందుబాటులో ఉండాలని చెప్పారు. జిల్లా అధికారులు తనిఖీలు చేస్తున్నా ఓపీ పెరగడంలేదని, సిబ్బంది ప్రవర్తనలో మార్పులేదంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా వర్కర్ల చేత పరిధి దాటి సెలైన్‌తోపాటు వివిధ రకాల ఇంజెక్షన్లు వంటి సేవలందించడం ఏంటని మండిపడ్డారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చిన రోగులకు ల్యాబ్ పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్‌లకు పంపి ఇబ్బందులు పెడుతున్నారని ఆమె దృష్టికి తెచ్చారు. అత్యవసర కేసులు ఉన్న సమయంలో వైద్యులు టెలీమెడిసెన్ ద్వారా లేదా వెంటనే ఆస్పత్రికి రావాలని ఆదేశించారు. డయేరియా, జ్వరాలు, మలేరియా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జ్వరాలున్న గ్రామాల్లో సర్వే నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. దోమలు, తాగునీటి లీకేజీల ద్వారా కలుషితమయ్యే నీటిని తాగడం వలన అంటువ్యాధులు, విషజ్వరాల బారిన పడే అవకాశం ఉందని ప్రజలు గుర్తించాలని కోరారు. నివాస ప్రాంతాల్లో చెత్తతోపాటు నీటి నిల్వలేకుండా చూడాలన్నారు. ఆమె వెంట ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ శిరీష, వైద్యాధికారులు పూజ, నవీన్‌లున్నారు.

బంగారుపాళెంలో అతిసారం

బంగారుపాళెం: మండల కేంద్రంలోని దళితవాడలో అతిసారం విజృంభిస్తుండడంతో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులకు సేవలు అందిస్తున్నారు. డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి గురువారం సాయంత్రం ఈ వైద్య శిబిరాలను సందర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ, మూడు రోజులుగా దళితవాడలో అతిసారం లక్షణాలతో కేసులు నమోదవుతున్నాయన్నారు. తాగునీటి నమూనాలను పరీక్ష నిమిత్తం తిరుపతికి పంపించినట్లు వివరించారు. దళితవాడ, బంగారుపాళెం-2 గ్రామ సచివాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. 10 రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు.

వీరాస్వామిది అతిసారంతో మృతి చెందలేదు

దళితవాడకు చెందిన వీరాస్వామి అతిసారంతో మృతి చెందలేదని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ తెలిపారు. వీరాస్వామి అనారోగ్యంతో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం మృతి చెందాడన్నారు. ఆయనకు లివర్, కిడ్నీ, గుండె సంబంధిత సమస్యలతోపాటు కడుపులో ఇన్‌ఫెక్షన్ రావడంతో మృతి చెందాడని తెలిపారు.

మూడురోజులుగా తాగునీరు బంద్

దళితవాడలో అతిసార కేసులు నమోదు కావడంతో మూడు రోజులుగా పంచాయతీ అధికారులు తాగునీటి సరఫరా నిలిపివేశారు. క్లోరినేషన్ చేసిన నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచిస్తున్నారు.

తాత్కాలిక డీవైఈఓల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిర్వహించనున్న ప్రభుత్వ టీచర్ల సర్దుబాటు ప్రక్రియకు తాత్కాలిక డీవైఈఓలను నియమిస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ డివిజన్ల వారీగా కుప్పంకు చంద్రశేఖర్, నగరికి దేవరాజు, పలమనేరుకు వెంకటేశ్వరరావును నియమించారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం విక్రేతల అరెస్టు



మద్యంతో పట్టుబడిన నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎంజీఆర్ వీధిలో పోలీసులు తనిఖీలు చేపట్టగా బంగారుపాళెంకు చెందిన బాలాజీ (25), చిత్తూరు అశోకపురానికి చెందిన జిలానీ (52) వద్ద కర్ణాటక మద్యం ప్యాకెట్లు లభించాయి. నిందితులు ఇద్దరినీ అరెస్టు చేసి, 17.5 లీటర్ల మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయరామయ్య తెలిపారు.

చిత్తూరు పోలీసుశాఖ ఎస్‌బీలో బదిలీలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖలోని స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) విభాగంలో పనిచేస్తున్న పలువురు సిబ్బందిని బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ చందోలు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు ఎస్పీలో పనిచేస్తున్న ఎ.రామకృష్ణను పాలసముద్రంకు, పి.అరుణాచలంను గంగవరానికి, తిరుమలలో ఉన్న కె.వి నాయకంను చిత్తూరు ఎస్‌బీకి, చిత్తూరు వన్‌టౌన్‌లో ఉన్న రామచంద్రాచారి, చౌడేపల్లెలో ఉన్న గోవిందస్వామి, పలమనేరులో ఉన్న టి.శ్రీనివాసులు, తవణంపల్లెలో ఉన్న బాలాజీని చిత్తూరు ఎస్‌బీకి బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ప్రకాష్‌బాబు (45), నరేష్ (40) అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ జయరామయ్య తెలిపారు. పాత బస్టాండులో తనిఖీలు చేయగా నిషేధిత లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి లాటరీ టికెట్లతో పాటు రూ.7,170 నగదు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వీఐపీలకు బ్లాక్‌మెయిల్ కాల్స్

- మీ అబ్బాయి కేసులో ఇరుక్కున్నాడు..
- ఇన్‌కంటాక్స్ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాం..
- మీ న్యూడ్ వీడియోను సోషల్ మీడియాలో పెడతాం.. అంటూ వాట్సాప్ కాల్ చేస్తున్న వైనం



పలమనేరు: మనకు తెలియకుండానే మన ఫోన్ నంబర్లు ఎవరెరికో చేరుతున్నాయి. దీంతో కొందరు అక్రమార్కులు రకరకాలుగా ఫోన్ కాల్స్ చేస్తూ బెదిరిస్తున్నారు. తాజాగా పలమనేరు పట్టణంలోని పలువురు వీఐపీలకు వాట్సాప్ ద్వారా బ్లాక్ మెయిల్ కాల్స్ వస్తున్నాయి. వారు చెప్పేమాటలు విని నిజమేమోనని బాధితులకు చెమటలు పడుతున్నాయి. మళ్లీ ఆ నంబర్లనుంచే కాల్ చేసి ఈ సమస్య పరిష్కరించాలంటే అడిగినంత డబ్బులు బ్యాంకు ఖాతాలో వేయాలంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఘటనలు గత వారం రోజులుగా పలమనేరు ప్రాంతంలో వెలుగుచూస్తున్నాయి.

ఇలాంటి ఫేక్ కాల్స్ వచ్చాయి

పట్టణంలోని ఓ రిటైర్డ్ ఎస్‌ఐ సెల్‌కి మూడు రోజుల క్రితం ఓ వాట్సాప్‌కాల్ వచ్చింది. హలో అనగానే తాము ముంబై పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నామని ఇక్కడున్న మీ అబ్బాయి ఓ కేసులో ఇరుక్కున్నాడని, కేసులో తప్పించాలంటే రూ.50 వేలు ట్రాన్స్‌ఫర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇది ఫేక్‌కాల్‌గా ఆయన గుర్తించి మళ్లీ చేస్తే ఆ నంబరు పనిచేయలేదు. అదే విధంగా పట్టణానికి చెందిన ఓ రియల్టర్ భార్యకు వాట్సాప్ కాల్ వచ్చింది. అందులో ఫోన్‌నెంబరు వద్ద పోలీస్ యూనిఫామ్ వేసుకున్న అధికారి పిక్ కనిపించింది. కాల్ చేసిన వ్యక్తి తాము ఇన్‌కంటాక్స్ వాళ్లమంటూ చెప్పి మీ ఇంటాయనపై కేసు బుక్ అయిందని కొంత డబ్బులు తమ అకౌంట్‌కు పంపాలని బెదిరించారు. దీంతో ఆమె ఇంటికొచ్చిన భర్తకు విషయం చెప్పడంతో ఆయన సెల్‌నుంచి ఆ నెంబర్‌కు కాల్ చేయగా మళ్లీ అదేమాట చెప్పారు. దీంతో ఆయన తమది పోలీస్ డిపార్ట్‌మెంటే అని గట్టిగా చెప్పడంతో మళ్లీ కాల్ రాలేదు. దీనిపై బాధితుడు స్థానిక పోలీసుల దృష్టికి సైతం తీసుకెళ్లారు. పట్టణానికి చెందిన ఓ లెక్చరర్ బయటి జిల్లాలో విధులు నిర్వహిస్తూ వారాంతపు సెలవుల్లో ఇంటికి వస్తుంటారు. ఆయనకు సైతం వాట్సాప్‌కాల్ వచ్చింది. మీరు ఎవరో అమ్మాయితో న్యూడ్‌గా ఉన్న వీడియో తమవద్ద ఉందని మేం చెప్పినట్టు చేయకుంటే దాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేస్తామంటూ బెదిరించారు. దీంతో ఆయన హైరానా పడిపోయినట్టు తెలిసింది. ఆపై తేరుకొని తాను సైబర్ క్రైమ్‌కు ఇప్పుడే కాల్ చేస్తానని చెప్పడంతో ఆ నంబరు స్విచ్ ఆఫ్ అయింది. పట్టణానికి చెందిన ఓ రిటైర్డ్ హెచ్‌ఎంకు కాల్ చేసి మీ బ్యాంకు ఖాతాలోకి ఫోన్‌పే ద్వారా పొరబాటున తమ నగదు జమైందనే కాల్స్ వస్తున్నాయి. వారిని లైన్‌లో పెట్టి ఫోన్‌పేను చెక్‌చేయమనడం, అదే సమయానికి ఓ లింక్‌ను పంపించి దాన్ని క్లిక్ చేస్తే తమ డబ్బు వస్తుందని నమ్మిస్తున్నారు. అయితే ఆమెకు స్మార్ట్‌ఫోన్‌లో పెద్దగా అలవాటు లేక మా అబ్బాయి వచ్చాక మాట్లాడండంటూ కాల్ కట్ చేసింది. ఇలాంటి ఫేక్ కాల్స్ పలువురు రియల్టర్లు, రియల్‌ఎస్టేట్, బిజినెస్‌చేసే వాళ్లు, ఫ్రూట్స్ వ్యాపారులు, ట్రేడర్స్‌కు రావడం విశేషం. ఇలాంటి సంఘటనలు కొన్ని మాత్రమే వెలుగులోకి రాగా బయటకు రానివి భారీగానే ఉన్నట్టు తెలుస్తోంది.

ఎవిడెన్స్ లేకుండా కాల్స్..

సాధారణ కాల్స్‌చేస్తే కాల్ డాటాలో నెంబరు డిస్‌ప్లే అవుతుంది. అయితే మోసగాళ్లు ఇలా కాకుండా వాట్సాప్ కాల్స్ చేస్తున్నారు. దీంతో వాటిని స్క్రీన్ షాట్ తీసేందుకు కుదరదు. ఫోనీ ట్రూకాలర్‌లో చెక్‌చేసి ఫొటోను డౌన్‌లోడ్ చేసుకుందామనుకున్నా లాక్ ప్రొఫైల్, నాట్ స్క్రీన్ షాట్ మోడ్‌లో పెట్టుకున్నారు. దీంతో ఇలాంటి కాల్స్ చేసేవాళ్ల వివరాలను తెలుసుకోవడం వీలుకావడం లేదు. సాక్ష్యం లేనందున సైబర్ క్రైమ్‌కు గానీ లోకల్ పోలీసులకుగానీ ఫిర్యాదు చేసేందుకు కావడం లేదు.

బెంగళూరు, ముంబై, చెన్నై పేర్లతో..

ఈ ప్రాంతంలోని చాలామంది చదువుకోసం, వ్యాపారాలకోసం బెంగళూరు, చెన్నైలకు వెళుతున్నారు. దీంతో ఇక్కడున్న వారికి పిల్లల పేర్లు చెప్పగానే నిజంగానే ఇబ్బందుల్లో ఉన్నారేమోనని నమ్మాల్సి వస్తోంది. ముఖ్యంగా బాగా డబ్బున్న వారి మొబైల్ నంబర్లకు కాల్స్ వస్తుడంతో ఆ ఇంటి యజమాని వ్యాపార పనుల్లో బయటకెళ్లినప్పుడు ఇంట్లోని వారు భయపడిపోతున్నారు.

ప్రజలు ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి



మనం స్మార్ట్‌ఫోన్‌లో రకరకాల యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తుంటాం. దీంతో మనకు తెలియకుండానే మన వివరాలను యాక్సెస్ చేసేస్తాం. ఫలితంగా మన వివరాలు సైబర్ నేరగాళ్ల చెంతకు వెళ్లిపోతాయి. వారు మన లావాదేవీలు లేదా సిబిల్ రేటింగ్ తదితరాల ద్వారా వీరు డబ్బున్నవారా కాదా అని నిర్ణయించుకొని ఆపై మోసాలకు దిగుతుంటారు. ఇలాంటి కాల్స్ వస్తే నమ్మకండి. ఎలాంటి లింకులు క్లిక్ చేయకుండా ఉండాలి. మనం ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఉండదు. – చంద్రశేఖర్, టౌన్ సీఐ, పలమనేరు

11న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

నగరి : జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 11వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పి.బాలాజి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల గ్రౌండ్ ఆవరణలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ ఎంపిక పోటీలు ఉంటాయని చెప్పారు. అన్ని విభాగాల్లోనూ ప్రతిభను అనుసరించి బాలుర, బాలికల జిల్లా జట్టు ఎంపిక చేస్తామన్నారు. సబ్ జూనియర్స్ పోటీలకు 2009 జనవరి 2 తరువాత జన్మించిన వారు, జూనియర్స్ పోటీలకు 2005 జనవరి 2 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ పోటీలు చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ బి.జగన్నాథం నాయుడు, ప్రెసిడెంట్ వెంకటస్వామి, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారుల సమక్షంలో ఉంటాయని పేర్కొన్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్లలో సబ్ జూనియర్స్ జట్టును అన్నవరంలో జరిగే రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలకు, జూనియర్స్ జట్టును విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీలకు, సీనియర్స్ జట్టును నంద్యాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీలకు పంపించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 70137 54776, 90528 60009ను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కేసులు



చదును చేస్తున్న వారిని హెచ్చరిస్తున్న తహసీల్దార్ హనుమంతునాయక్

చౌడేపల్లి: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హనుమంతు నాయక్ హెచ్చరికలు చేశారు. భూ ఆక్రమణలపై బోయకొండలో భూదందా అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశాల మేరకు గురువారం తహసీల్దార్, సిబ్బందితో కలిసి కొదమదేవర గుట్ట, బోయకొండ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సర్వే నెంబరు 471/2, 191/1 ప్రాంతాన్ని సందర్శించి రైతులు, చుట్టు పక్క పొలాలను చదునుచేస్తున్న వారితో మాట్లాడారు. ప్రభుత్వ అసైన్‌మెంట్ భూములను ఎవరూ కొనడం అమ్మడం చట్టరీత్యానేరమన్నారు. భూములు యానాదులకు చెందినవి కాగా మరొకరు చదును చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆ ప్రాంతంలో పూడ్చేసిన చిన్నకుంట సరిహద్దులను అధికారులు గుర్తించారు. కుంటను మళ్లీ రీ ఓపెన్ చేయాలని హెచ్చరించారు. పూర్వీకుల కాలం నుంచి రికార్డుల ఆధారంగా ఉన్న వర్షపునీరు వెళ్లే కాలువలు, బండి బాటను ప్రజల సౌకర్యార్థం కొనసాగించాలన్నారు. ఎవరైనా భూ అభివృద్ధి పనులు చేపట్టాలంటే రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొదమదేవర గుట్ట చుట్టూ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని ఫిర్యాదులొచ్చాయని సర్వేయర్లు వెంటనే వాటిని సర్వే నిర్వహించి ఆక్రమణదారులను గుర్తించాలని ఆదేశించారు. వారి వెంట సర్వేయర్లు మురళీకృష్ణ, నీలిమ తదితరులున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న హెడ్ కానిస్టేబుల్ నాగరాజు

కుప్పంరూరల్: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుప్పం రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కథనం మేరకు, సుమారు 55 ఏళ్ల వ్యక్తి బ్లూ కలర్ నైట్ ప్యాంటు, క్రీమ్ కలర్ టీ షర్టు ధరించి ఉన్నట్లు చెప్పారు. తల నుజ్జు నుజ్జు కావడంతో గుర్తు పట్టలేనంతగా శరీరం తయారైనట్లు ఆయన చెప్పారు. ఎవరైనా ఈ ఆనవాళ్లు ఉన్న వ్యక్తి తప్పిపోయి ఉంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నాగరాజు చెప్పారు.

రూ.70 లక్షల మొబైల్ ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన ఫోన్లు, పోలీసులు, బాధితులతో ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: సెల్‌ఫోన్లను పోగొట్టుకోవడం, చోరీకి గురైన సమయంలో వాటిని తిరిగిపొందడానికి ఏర్పాటు చేసిన చాట్‌బాట్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోందని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు స్పష్టం చేశారు. పలువురు బాధితులు పోగొట్టుకున్న దాదాపు రూ.70 లక్షల విలువ చేసే 330 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి, వాటిని బాధితులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చిత్తూరులోని పోలీసు అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఏడు విడతల్లో 2,030 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, రూ.4.30 కోట్ల విలువచేసే మొబైల్‌ఫోన్లను బాధితులకు అందజేశామన్నారు. ఇది చిత్తూరు పోలీసుశాఖ పనితీరుకు నిదర్శమన్నారు. చాట్‌బాట్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఫోన్లను కనిపెట్టి, వాటిని ఇక్కడకు రప్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఏపీతో పాటు తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర నుంచి ఫోన్లను ట్రాక్‌చేసి ఇక్కడకు తీసుకొచ్చి బాధితులకు అందిస్తున్నామన్నారు. మొబైల్ పోగొట్టుకుంటే ఫోన్-9440900004 (చాట్‌బాట్) నెంబర్‌తో పాటు www.ceir.gov.in/home/index.jsp అనే వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు ఇవ్వొచ్చని ఎస్పీ తెలిపారు. ఇంకా రికవరీ చేయాల్సిన ఫోన్లు ఉన్నాయని, వాటిని కూడా త్వరగా తెప్పిస్తామన్నారు. క్రైమ్ సీఐ రామాంజనేయులు, సిబ్బంది బాపూజీ, శ్రీనివాస్, రఘు తదితరులను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ఆరీఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన మహిళకు జైలు



పోలీసుల అదుపులో నిందితురాలు నిర్మల

చిత్తూరు అర్బన్: నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడిన మహిళకు 18 నెలల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయస్థానం గురువారం తీర్పునిచ్చింది. చిత్తూరు నగరానికి చెందిన విశ్వనాథ్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ఇతనికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని పూతలపట్టుకు చెందిన కిరణ్‌కుమార్ చెప్పాడు. తనకు తెలిసిన వాళ్లు ఉన్నారంటూ గుంటూరుకు చెందిన శోభారాణి, శ్రీకాకుళానికి చెందిన నిర్మల (36)ను పరిచయం చేశాడు. 2019–20వ సంవత్సరం విశ్వనాథ్, అతని స్నేహితులు ఏడుగురు కలిసి నిందితులు ముగ్గురికీ రూ.14.85 లక్షల నగదు పలు దఫాల్లో ముట్టజెప్పారు. తీరా ఉద్యోగాలు రాకపోవడంతో చిత్తూరు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నిందితులపై రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కేసులు ఉన్నాయి. నిర్మలకు ఇలాంటి కేసులో గుంటూరు జిల్లాలోని కోర్టు ఏడాది జైలుశిక్ష విధించింది. దీంతో ఈమెను చిత్తూరు కోర్టుకు తీసుకురాగా, ఇక్కడ కేసు విచారణ పూర్తవడంతో నేరం రుజువైంది. నిర్మలకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ చిత్తూరులోని 5వ అదనపు న్యాయస్థానం జడ్జి కీర్తన తీర్పునిచ్చారు. మిగిలిన ఇద్దరు నిందితులపై కేసు విచారణ పెండింగ్‌లో ఉన్నట్లు చిత్తూరు సీసీఎస్ సీఐ రామాంజనేయులు తెలిపారు.

ఇసుకాసురులను అడ్డుకున్న గ్రామస్తులు



తరలిస్తున్న ఇసుకను అడ్డుకుంటున్న గంగినాయనపల్లె గ్రామస్తులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. అక్రమంగా చెరువుల్లో ఇసుకను తరలిస్తున్నా గ్రామస్తులు ఎవరూ పట్టించుకోలేదు. ఇసుక భారీగా తరలిపోతున్న నేపథ్యంలో బైరెడ్డిపల్లె మండలం గంగినాయనపల్లె గ్రామస్తులు ఇసుకాసురులను అడ్డుకున్నారు. గంగినాయనపల్లె సమీపంలోని మారెమ్మ ఆలయ నిర్మాణానికి సుమారు 15 ట్రాక్టర్ల ఇసుకను గ్రామస్తులు కొనుగోలు చేశారు. ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నా టీడీపీ నేతలు పట్టించుకోకుండా గురువారం సాయంత్రం ఇసుకను తరలించారు. దీంతో అడ్డుకున్న గ్రామస్తులపై దౌర్జన్యానికి దిగారు. మహిళలను దుర్భాషలాడారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా ఫలితం లేకపోవడంతో గ్రామస్తులందరూ కలిసికట్టుగా తిరగబడ్డారు. ఇకపై గ్రామ సమీపంలోని చెరువుల్లోకి వస్తే ఊరుకోమని తేల్చిచెప్పారు.

కూటమి మార్కు బదిలీలు

- ఉమ్మడి జిల్లాలో డీఎస్పీ, సీఐలకు స్థానచలనం

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు డీఎస్పీలు, సీఐలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటికే మూడు మార్లు వెలువడిన డీఎస్పీలు, సీఐల బదిలీల్లో పాటించిన ×కుల× ప్రామాణికాన్నే ఈ బదిలీల్లోనూ అమలు చేసినట్లు పోలీసుశాఖలో పెద్ద చర్చ నడుస్తోంది. ఎస్సీ, బీసీలతో పాటు పేర్ల చివరన రెడ్డి అని ఉంటే వాళ్లకు పోస్టింగులు ఇవ్వకుండా కూటమి పెద్దలు జాగ్రత్తగా బదిలీలను పర్యవేక్షిస్తున్నారు. ఇదే సమయంలో పేర్ల చివరన మూడు అక్షరాలున్న వాళ్లకు అగ్ర తాంబూలం ఇచ్చి అందలం ఎక్కిస్తున్నారు. ఇక బదిలీ అయిన అధికారుల వివరాలు పరిశీలిస్తే.. చిత్తూరు డీఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డిను పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని సూచిస్తూ, ఆయనకు పోస్టింగ్ ఇవ్వలేదు. ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగంలో పనిచేస్తున్న జి.చెంచుబాబును నాయుడుపేటకు, పోస్టింగ్ కోసం వేచివున్న కె.విజయ్‌శేఖర్‌ను తిరుమల శాంతిభద్రతలు, ఎస్‌ఈబీలో పనిచేస్తున్న జె.వెంకటనారాయణను తిరుపతి శాంతి భద్రతలు, తిరుపతి స్పెషల్‌బ్రాంచ్‌లో ఉన్న ఎం.వెంకటాద్రిని రేణిగుంట, రేణిగుంటలో ఉన్న భయ్య కిషోర్‌ను రాజమండ్రి దక్షిణ విభాగం, ఎర్రచందన స్మగ్లింగ్ నిరోధక విభాగంలో పనిచేస్తున్న జి.రవికుమార్‌ను పుత్తూరు, పుత్తూరులో ఉన్న వై.శ్రీనివాసరావును సీఐడీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐల బదిలీల్లో తిరుపతి ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగంలో పనిచేస్తున్న కె.గంగాధరరావును బాపట్ల రూరల్, పల్నాడు జిల్లా పెదకూరపాడులో ఉన్న జి.మంగారావును గూడూరుకు, గుంటూరు వేకెంట్ రిజర్వు (వీఆర్)లో ఉన్న కె.శేఖర్‌బాబును గూడూరు వన్‌టౌన్, నెల్లూరు సోషల్ మీడియా సైబర్ క్రైమ్‌లో ఉన్న హెచ్‌ఎస్.హుస్సేన్ బాషను వాకాడు, నెల్లూరు టూటౌన్‌లో ఉన్న ఎం.బాబీను నాయుడుపేట అర్బన్, గుంటూరు వీఆర్‌లో ఉన్న ఎం.మురళీకృష్ణను సూళ్లూరుపేటకు బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ సౌత్ కోస్టల్ జోన్ ఐజీ త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు.

శ్రీసిటీలో 500 మంది రక్తదానం



శ్రీసిటీలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్, శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీసిటీలోని మూడు వేర్వేరు ప్రదేశాల్లో రక్తదాన శిబిరాలను గురువారం నిర్వహించారు. యాక్సలెంట్ ఫార్మా, బ్రేక్స్ ఇండియా, ఇసుజు, నిట్టాన్ ఇండియా, రాక్‌వర్త్, వెర్మీరియన్, టిల్, ఈప్యాక్ సహా 40 పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు, సూళ్లూరుపేట గోకులకృష్ణ ఇంజినీరింగ్, సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సుమారు 500 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ప్రాణాలను రక్షించే రక్తదానంలో భాగస్వాములైన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు జీఎస్టీ కమిషనరేట్ సూపరింటెండెంట్ సునీల్ గౌతమ్, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, సీఎస్ఆర్ మేనేజర్ నిరీషా సన్నారెడ్డి, హెచ్ఆర్ ప్రతినిధి శివకుమార్‌రెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.